జర్నలిస్ట్ వార్త
మంగళవారం12 మే 2026

# బయ్యారంలో ఘనంగా ఏనుగుల రాకేష్ రెడ్డి జన్మదిన వేడుకలు.



**బయ్యారం/,మే 11(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి జన్మదిన వేడుకలు పార్టీ మండల నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తమ ప్రియతమ నాయకుడు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, పేద ప్రజలకు నిరంతరం చేయూతనిస్తూ, పార్టీని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలోసీనియర్ నాయకులు ఏనుగుల ఐలయ్య,యూత్ అధ్యక్షుడు బానోత్ లక్ష్మణ్ నాయక్,సుర్ణపాక శేఖర్,రేపాకుల వెంకన్న,లాకావత్ మహేష్,కంబాల లెనిన్,శోభన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# బండి సంజయ్ పదవి వీడాలి

## నిష్పక్షపాత విచారణ జరగాలి

### హుస్నాబాద్ మాజీ శాసనసభ్యుడు ఒడితల సతీశ్ కుమార్ డిమాండ్



**ఎల్కతుర్తి,/ మే 11 (జర్నలిస్ట్ వార్త):**
కుమారుడిపై నమోదైన బాలల రక్షణ చట్టం కేసు నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ వెంటనే పదవి వీడాలని హుస్నాబాద్ మాజీ శాసనసభ్యుడు ఒడితల సతీశ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ బాధ్యతాయుత స్థానంలో ఉండి కుమారుడిపై నమోదైన కేసును బలహీనపర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.
ఈ వ్యవహారంలో నిందితుడిగా ఉన్న బండి భగీరథను తక్షణమే అదుపులోకి తీసుకోవాలని కోరారు. మైనర్ బాలికపై వేధింపులకు పాల్పడ్డాడనే ఆరోపణలతో కేసు నమోదు చేసి మూడు రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యకరమన్నారు. ఇంత తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్నప్పటికీ బండి సంజయ్ మౌనం పాటించడం తగదన్నారు. నిందితుడిని కనీసం విచారణకు కూడా పిలవకపోవడం వెనుక పోలీసులపై ఒత్తిడి ఉన్నదనే అనుమానం వ్యక్తం చేశారు.
ప్రధాని సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బండి సంజయ్ కలిసి నవ్వులు పంచుకోవడం చూస్తుంటే కేసును నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలు కలుగుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి స్పందించి ఈ వ్యవహారంపై నిష్పక్షపాత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

# జిల్లా గ్రంధాలయ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డిని కలిసిన కొత్తపేట సర్పంచ్.



**బయ్యారం/,మే 11.(జర్నలిస్ట్ వార్త)**
మహబూబాబాద్ జిల్లా గ్రంధాలయ చైర్మన్ గా నియమితులైన వెన్నం శ్రీకాంత్ రెడ్డిని కొత్తపేట సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ వారి స్వగృహం రెడ్యాలలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా ప్రవీణ్ నాయక్ మాట్లాడుతు వెన్నం శ్రీకాంత్ రెడ్డి ప్రజాసేవలో మరింత ఉన్నత స్థానాలను అధిరోహించి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. జిల్లా గ్రంధాలయ అభివృద్ధిలో మరింత భాగస్వామ్యం కావాలని ప్రవీణ్ నాయక్ కోరారు.

# నేడు హనుమాన్ జయంతి సందర్బంగా బైక్ ర్యాలీ.



**బయ్యారం/,మే 11.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండల కేంద్రంలోని శ్రీ కోదండసీతారామచంద్రస్వామి దేవాలయంలో ఉదయం 4 గంటలకు సుప్రభాత సేవ కార్యక్రమం తదుపరి సీతారామచంద్ర స్వామికి ప్రత్యేక అభిషేకకార్యక్రమాలు, 6:30 కి హనుమాన్ కి అభిషేకం,చందనగోష్టి కార్యక్రమాలు నిర్వహించబడునని ఆలయ అర్చకులు సుదర్శన చార్యులు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి సందర్బంగా మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. ఈ బైకు ర్యాలీ ఉదయం 8 గంటలకు రామాలయం ప్రాంగణం నుండి ప్రారంభం అయి బస్టాండ్ మీదుగా జగ్గుతండా వయా బయ్యారం శివాలయం మీదుగా గాంధీ సెంటర్ నుండి ర్యాలీ రామాలయం దగ్గర ముగుస్తుదన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని యాత్రను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ వారు పిలుపునిచ్చారు.

# కష్టపడిన వారికే అధ్యక్ష పదవులు ఇవ్వాలి



**ఎల్కతుర్తి/, మే 11 (జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ పార్టీ కోసం సంవత్సరాల తరబడి కష్టపడి పనిచేసిన కార్యకర్తలకే అధ్యక్ష పదవులు ఇవ్వాలని పార్టీ సీనియర్ నాయకుడు పాక రమేష్ డిమాండ్ చేశారు. ఎల్కతుర్తి మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ముప్పై ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ జెండా మోస్తూ ప్రజల్లో పార్టీ బలోపేతానికి సేవలు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన రమేష్, ఆయన సేవలను కొనియాడారు. మండల అభివృద్ధికి మంత్రి విశేష కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ట్రిపుల్ ఐటీ, కోర్టు వంటి కీలక సంస్థలను మండలానికి తీసుకురావడం ద్వారా పొన్నం ప్రభాకర్ చరిత్ర సృష్టిస్తున్నారని అన్నారు. వందల కోట్ల రూపాయల నిధులతో ఎల్కతుర్తి మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్నారని తెలిపారు.
రాబోయే రోజుల్లో మండల కేంద్రంతో పాటు గ్రామాలు కూడా మరింత అభివృద్ధి చెందనున్నాయని, ప్రజలు కాంగ్రెస్ వైపు ఆశగా చూస్తున్నారని రమేష్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీని ప్రజలు ఇప్పటికే మరిచిపోయారని ఆయన విమర్శించారు.

# మంత్రి కుమారుడిని వెంటనే అదుపులోకి తీసుకోవాలి

## దళిత హక్కుల పోరాట సమితి డిమాండ్



**ధర్మసాగర్ /హనుమకొండ, బ్యూరో మే 11:**
కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు సాయి భగీరథపై నమోదైన బాలికల రక్షణ చట్టం కేసులో వెంటనే అదుపులోకి తీసుకుని కఠిన చర్యలు చేపట్టాలని దళిత హక్కుల పోరాట సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు రాజారపు రత్నం డిమాండ్ చేశారు. సామాన్యులకు ఒక న్యాయం, అధికార వర్గాలకు మరో న్యాయమా అని ప్రశ్నించారు. జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయని విమర్శించారు. ఓ బాలిక మూడు నెలలుగా న్యాయం కోసం పోరాడాల్సి రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. బాధితురాలు, ఆమె కుటుంబాన్ని వేధించడం అమానుషమని ఆగ్రహం వ్యక్తం చేశారు.
"బేటీ బచావో, బేటీ పడావో" అంటూ పెద్ద పెద్ద మాటలు చెప్పే భారతీయ జనతా పార్టీ నాయకులు, ఇప్పుడు తమ పార్టీకి చెందిన కేంద్ర మంత్రి కుటుంబంపై వచ్చిన ఆరోపణల విషయంలో ఎందుకు మౌనం పాటిస్తున్నారని ప్రశ్నించారు. బాలిక అన్ని ఆధారాలతో ఫిర్యాదు చేసినప్పటికీ వెంటనే స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. చట్టం ముందు అందరూ సమానమేనని, రాజకీయ అండదండలు ఉన్న వారినీ వదిలిపెట్టకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. బాధిత బాలికకు న్యాయం జరగకపోతే రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, రహదారి దిగ్బంధనలు చేపడతామని హెచ్చరించారు. నిందితుడికి కఠిన శిక్ష విధించాలని ప్రభుత్వాన్ని కోరారు.ం

# సహారా డిపాజిటర్లకు భరోసా

## ఆందోళన అవసరం లేదన్న తిరుపతి రెడ్డి



**ఎల్కతుర్తి/, మే 11 (జర్నలిస్ట్ వార్త):**
సహారా సంస్థలో పెట్టుబడులు పెట్టిన డిపాజిటర్లు ఎలాంటి ఆందోళన చెందవద్దని ఎడ్ల తిరుపతి రెడ్డి భరోసా ఇచ్చారు. డిపాజిటర్ల వద్ద ఉన్న బాండ్ల ఆధారంగా ప్రభుత్వం డబ్బులు చెల్లించే ప్రక్రియ చేపడుతుందని తెలిపారు. సహారా సంస్థకు సంబంధించిన ఆస్తులు, పత్రాలు ప్రభుత్వ ఆధీనంలోనే ఉన్నాయని పేర్కొన్నారు.
సంస్థకు చెందిన భారీ ఆస్తులు ప్రభుత్వ పర్యవేక్షణలో ఉండటంతో డిపాజిటర్లకు ఎలాంటి నష్టం జరగదన్నారు. కొందరు వ్యక్తులు చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మి ప్రజలు ఆందోళన చెందొద్దని సూచించారు. "డబ్బులు వస్తాయో రావో" అన్న భయంతో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని హెచ్చరించారు. త్వరలోనే అర్హులైన డిపాజిటర్ల ఖాతాల్లో ప్రభుత్వం నేరుగా నగదు జమ చేసే అవకాశం ఉందని తెలిపారు. డిపాజిటర్లు నిశ్చింతగా ఉండాలని, ప్రభుత్వం వారి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఈ విషయాన్ని ఎడ్ల తిరుపతి రెడ్డి మీడియాతో మాట్లాడుతు వెల్లడించారు.

# వికలాంగుడిపై మద్యం సిండికేట్ ప్రతాపం..!

**మిట్టపల్లిలో విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు**

**క్వార్టర్‌పై రూ.30 నుంచి రూ.40 వరకు అదనపు వసూళ్లు**

**అబ్కారీ అధికారులు మౌనం..**

**కుటుంబంతో వైన్‌షాప్ ఎదుట వికలాంగుడి ఆందోళన**




**తల్లాడ/, మే 11 (జర్నలిస్ట్ వార్త):**
ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మిట్టపల్లిలో మద్యం సిండికేట్ దందా బహిరంగంగానే సాగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎమ్మార్పీ ధరలకు మద్యం విక్రయించాల్సిన వ్యాపారులు సిండికేట్‌గా మారి క్వార్టర్‌పై రూ.30 నుంచి రూ.40 వరకు అదనంగా వసూలు చేస్తూ మందుబాబుల జేబులు ఖాళీ చేస్తున్నారని గ్రామస్థులు మండిపడుతున్నారు. బెల్ట్‌షాపుల ద్వారా యథేచ్ఛగా మద్యం అమ్మకాలు సాగుతున్నప్పటికీ అబ్కారీ అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా గ్రామానికి చెందిన ఓ వికలాంగుడు తనపై మద్యం సిండికేట్ ప్రతాపం చూపుతోందంటూ కుటుంబ సమేతంగా సోమవారం మిట్టపల్లి వైన్‌షాప్ ఎదుట ఆందోళనకు దిగాడు. నిరుపేద కుటుంబానికి చెందిన తాను చిన్నస్థాయిలో మద్యం విక్రయిస్తూ జీవనం సాగిస్తుంటే సిండికేట్‌గా వ్యవహరిస్తున్న కొందరు వ్యాపారులు తనపై కేసులు పెట్టించి లక్షల్లో జరిమానాలు వేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. పెద్ద ఎత్తున అక్రమ మద్యం విక్రయాలు చేస్తున్న వారిని వదిలేసి తనలాంటి వికలాంగుడిని టార్గెట్ చేయడం అన్యాయమని వాపోయాడు.

### వీధికో బెల్ట్‌షాప్..!

తల్లాడ మండల వ్యాప్తంగా బెల్ట్‌షాపులు పుట్టగొడుగుల్లా పెరిగిపోతున్నాయని ప్రజలు చెబుతున్నారు. గ్రామాల్లో ప్రతి వీధికీ ఐదారు చొప్పున బెల్ట్‌షాపులు దర్శనమిస్తున్నాయని ఆరోపిస్తున్నారు. వేసవిలో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నా మద్యం మాత్రం ఏరులై పారుతోందని విమర్శిస్తున్నారు.

### రెండు నెలల్లోనే భారీగా పెరిగిన ధరలు

మండలంలో గత రెండు నెలలుగా మద్యం ధరలు భారీగా పెరిగినట్లు సమాచారం. ఓఏబీ క్వార్టర్‌ను రూ.140 నుంచి రూ.160కు, మ్యాన్షన్ హౌస్‌ను రూ.180 నుంచి రూ.210కు, ఎంసీ డైట్‌ను రూ.180 నుంచి రూ.210కు, ఇంపీరియల్ బ్లూను రూ.140 నుంచి రూ.210 వరకు పెంచి విక్రయిస్తున్నట్లు మందుబాబులు చెబుతున్నారు. బీర్ల ధరలు కూడా రూ.180 నుంచి రూ.220కు చేరాయని వాపోతున్నారు. ఎమ్మార్పీకి మించి వసూళ్లు చేస్తూ కోట్ల రూపాయలు దండుకుంటున్నారని ఆరోపిస్తున్నారు.

### సిండికేట్‌గా మారిన వ్యాపారులు

కొద్ది రోజుల క్రితం వరకు ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయించిన వ్యాపారులు ఇప్పుడు సిండికేట్‌గా మారి ఏకపక్షంగా ధరలు పెంచినట్లు తెలుస్తోంది. బెల్ట్‌షాపులకు భారీగా మద్యం సరఫరా చేస్తూ అక్రమంగా కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### అబ్కారీ శాఖపై ప్రజల ఆగ్రహం

ఇంత బహిరంగంగా అధిక ధరలకు మద్యం విక్రయాలు సాగుతున్నప్పటికీ అబ్కారీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండల ప్రజలు మండిపడుతున్నారు. ఇతర మండలాల్లో ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయిస్తుంటే తల్లాడలో మాత్రం అదనపు ధరలు ఎందుకు వసూలు చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి అక్రమ విక్రయాలు, బెల్ట్‌షాపులు, అధిక ధరలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

### డోర్ డెలివరీతో కొత్త దందా

మద్యం వ్యాపారులు ఇప్పుడు డోర్ డెలివరీ పేరుతో కొత్త దందాకు తెరలేపినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రూ.10 వేలకుపైగా ఆర్డర్ ఇస్తే మద్యం నేరుగా ఇంటికే సరఫరా చేస్తున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా మద్యం వ్యాపారులు డోర్ డెలివరీ చేపట్టి ప్రజల నుంచి భారీగా డబ్బులు దోచుకుంటున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# దివ్యాంగునికి ఎలక్ట్రిక్ బైక్ అందజేత



**తల్లాడ, మే 11( జర్నలిస్ట్ వార్త):** రెండు కాళ్లు కోల్పోయి దివ్యాంగుడిగా జీవనం సాగిస్తున్న వ్యక్తికి దాత తొండపు సైదేశ్వరరావు సహకారంతో ఎలక్ట్రిక్ బైక్‌ను అందజేశారు. అంజనాపురం గ్రామ సర్పంచ్ నల్లగొర్ల రాధాకృష్ణయ్య, ఉపసర్పంచ్ కేతినేని చలపతిరావు ఆధ్వర్యంలో సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ దివ్యాంగులకు సహాయం చేయడం సమాజ బాధ్యత అని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ బైక్ ద్వారా బాధితుడు తన దైనందిన కార్యకలాపాలను సులభంగా నిర్వహించుకోగలడని తెలిపారు. దాత తొండపు సైదేశ్వరరావు సేవాభావాన్ని అభినందించారు. కార్యక్రమంలో కేతినేని వెంకటరామారావు, నల్లగొర్ల నర్సింహా, కిన్నెరా వెంకటేశ్వర్లు, కేతినేని నరేష్, చందా వెంకటేశ్వర్లు, వంగూరి బాలయ్య, అఖిల్, బంటి, పాముల వెంకటేశ్వర్లు, అనిల్, తేజ తదితరులు పాల్గొన్నారు.

# జూనియర్ ఎన్టీఆర్ బర్త్‌డే వేడుకలకు శ్రీకారం

## తల్లాడలో మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



**తల్లాడ, మే 11( జర్నలిస్ట్ వార్త)**జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకల్లో భాగంగా తల్లాడలో ఎన్టీఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండుతున్న ఎండల నేపథ్యంలో ప్రజలు, ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు నున్న నాగేశ్వరరావు ఆదేశాల మేరకు జూనియర్ ఎన్టీఆర్ యువసేన తల్లాడ మండల అధ్యక్షుడు నారపోగు విజయ్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బస్టాండ్ సెంటర్ వద్ద మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని మండల వైద్యాధికారి డా. ప్రత్యూష ప్రారంభించారు. ఈ సందర్భంగా నారపోగు విజయ్ మాట్లాడుతూ.. ఈ నెల 20న జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, త్వరలో రక్తదాన శిబిరం కూడా నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పాస్టర్ దారెల్లి తిమోతి, కంట్రోలర్ లాలయ్య, టిడిపి నాయకులు నారపోగు ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు రేగళ్ల శ్రీనివాసరావు, అజయ్, యాదవ మహారాజుగంగా, కంత్రి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



# జీవో-17 రద్దు చేయాలి.. లేదంటే ఉద్యమమే

## ఖమ్మం కలెక్టరేట్ ముట్టడి చేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాంట్రాక్టర్లు

## స్థానికుల హక్కులు హరించొద్దంటూ ప్రభుత్వానికి హెచ్చరిక

**ఖమ్మం,/ మే 11 (జర్నలిస్టు వార్త):**
గురుకుల విద్యాసంస్థల కాంట్రాక్టు వ్యవస్థలో అమలులోకి తీసుకొచ్చిన జీవో నెంబర్-17ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాంట్రాక్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ విధానాలతో స్థానిక కాంట్రాక్టర్ల జీవనోపాధి ప్రమాదంలో పడిందంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లకు వినతిపత్రం సమర్పించారు.
ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో-17 వల్ల ప్రభుత్వ రంగంలోని గురుకుల, విద్యాసంస్థల టెండర్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాంట్రాక్టర్లకు అవకాశాలు పూర్తిగా తగ్గిపోయాయని ఆరోపించారు. స్థానికులకు రావాల్సిన పనులను ఇతర రాష్ట్రాలకు చెందిన సంస్థలకు కట్టబెట్టడం వెనుక భారీ లోపాయికారీ వ్యవహారాలు ఉన్నాయని విమర్శించారు. ముఖ్యంగా గుజరాత్‌కు చెందిన మఫ్ఫత్‌లాల్ కంపెనీకి టెండర్లు అప్పగించడం ద్వారా తెలంగాణ కాంట్రాక్టర్లను పూర్తిగా పక్కన పెట్టారని మండిపడ్డారు. చేవెళ్ల, కామారెడ్డి డిక్లరేషన్‌లలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రభుత్వం గుర్తు పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక కాంట్రాక్టర్లకు



ప్రాధాన్యం ఇస్తామని చెప్పి ఇప్పుడు కార్పొరేట్ కంపెనీలకు పెద్దపీట వేయడం దారుణమన్నారు. గత ప్రభుత్వ హయాంలో కొనసాగిన విధంగానే తెలంగాణకు చెందిన కాంట్రాక్టర్లకే అవకాశాలు కల్పించాలని కోరారు. స్థానికులకు పనులు ఇస్తే నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందని, చిన్న కాంట్రాక్టర్ల కుటుంబాలు నిలదొక్కుకుంటాయని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీవో-17ను రద్దు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా దశలవారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, నిరుద్యోగ యువతను కలుపుకుని పెద్ద ఎత్తున ఉద్యమం నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దారా చిరంజీవి, రత్తయ్య, సుధాకర్, ఉదయ్ వారియర్, మేకల హనుమంతరావు, గోపాలరావు, జయరాజు, లలయ్య, రత్నాకర్, వై. వెంకటేశ్వర్లు, రాజు, మధు, రాజేష్, సంతోష్, సురేష్, బాలరాజు, పుల్లయ్య, నర్సయ్య, జర్పుల ప్రసాద్, మేకల కృష్ణ తదితరులు పాల్గొన్నారు

# గుప్త నిధుల కోసమే శివాలయం కూల్చివేత: హరీశ్‌రావు

**అర్ధరాత్రి 24 అడుగుల తవ్వకాలు చేశారని ఆరోపణ**

**ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల టెండర్లలో రూ.500 కోట్ల కుంభకోణమని విమర్శ**

**అశోక్‌నగర్‌లో ధ్వంసమైన కాకతీయుల ఆలయ పరిశీలన**

**నర్సంపేట/, మే 11 (జర్నలిస్ట్ వార్త):**
ఖానాపురం మండలం అశోక్‌నగర్‌లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం పేరుతో 800 ఏళ్ల చరిత్ర కలిగిన కాకతీయుల నాటి మట్టికోట శివాలయాన్ని ఉద్దేశపూర్వకంగా కూల్చేశారని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. సోమవారం ధ్వంసమైన ఆలయాన్ని సందర్శించిన ఆయన స్థానికులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం గుప్తనిధుల కోసం అర్ధరాత్రి తవ్వకాలు జరిపిందని విమర్శించారు.
"స్కూల్ నిర్మాణం కోసం అయితే పగలే పనులు చేయవచ్చు. రాత్రి 12 గంటల నుంచి 1 గంట మధ్య గర్భగుడి కింద 24 అడుగుల లోతు వరకు ఎందుకు తవ్వారు?" అని ప్రశ్నించారు. ఇది గుప్తనిధుల వేటేనని, సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతోనే ఈ చర్యలు జరిగాయని ఆరోపించారు.
పురావస్తు శాఖ జిల్లా అధికారి ఈ నెల 7న కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. తవ్వకాలకు ఉపయోగించిన యంత్రాలను స్వాధీనం



చేసుకుని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
"దేవాలయ భూమి ప్రభుత్వ భూమిగా ఎలా మారింది?" బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణిలో దేవాలయ భూమిగా నమోదైన స్థలం కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత భూభారతిలో ప్రభుత్వ భూమిగా ఎలా మారిందని హరీశ్‌రావు ప్రశ్నించారు. స్కూల్ నిర్మాణానికి చుట్టుపక్కల విస్తారంగా స్థలం ఉన్నప్పటికీ గుడి ఉన్న ప్రదేశాన్నే ఎందుకు ఎంపిక చేశారో ప్రభుత్వం స్పష్టం చేయాలన్నారు.
1958 పురావస్తు చట్టం ప్రకారం వందేళ్లు దాటిన కట్టడాలు పురావస్తు శాఖ పరిధిలోకి వస్తాయని, ఈ చారిత్రక ఆలయాన్ని యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలని కోరారు.

**"టెండర్లలో భారీ అవినీతి"**

ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల టెండర్లలో భారీ అవినీతి జరిగిందని హరీశ్‌రావు ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా 76 స్కూళ్ల టెండర్లు అన్నీ 4.86 నుంచి 4.99 శాతం ఎక్సెస్‌తోనే మంజూరు చేశారని తెలిపారు. ఒక్క టెండర్ కూడా





మైనస్‌కు వెళ్లకపోవడం వెనుక భారీ అవకతవకలు ఉన్నాయని విమర్శించారు. నర్సంపేట ప్యాకేజ్-8 కింద రూ.136 కోట్ల పనిని రూ.142 కోట్లకు అప్పగించారని, ఈ విధంగా దాదాపు రూ.494 కోట్ల ప్రజాధనం దోపిడీ జరిగిందన్నారు. కాంట్రాక్టర్లు తన మనుషులేనని సీఎం ఆరోపిస్తే వెంటనే టెండర్లు రద్దు చేయాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, శంకర్‌నాయక్, వినయ్‌భాస్కర్, ఆరూరి రమేష్, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్సవాలు ప్రారంభం




**నర్సంపేట, /మే 11 (జర్నలిస్ట్ వార్త)**నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారోత్సవాల 7 రోజుల కార్యాచరణ ప్రణాళికను ఆవిష్కరించారు. ప్రత్యేక బ్రోచర్లు, ఫ్లెక్సీలు, ఆన్‌లైన్ ఈ-రిసోర్సులకు సంబంధించిన కంపెండియంను విడుదల చేశారు. వైస్ ప్రిన్సిపాల్ డా. బైరి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. విద్యతో పాటు సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలు, నైతిక విలువలను అలవరచుకోవాలని సూచించారు. విద్యా వారోత్సవాల్లో భాగంగా యోగా, మెడిటేషన్, గ్రామస్థాయిలో కళాశాల కోర్సుల ప్రచారం, పేరెంట్-టీచర్ సమావేశాలు, పూర్వ విద్యార్థుల సమ్మేళనం, లైబ్రరీ డే, బుక్ ఎగ్జిబిషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని సూచించారు. డ్రగ్స్, మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని, వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. సోషల్ మీడియాపై సమయం వృథా చేయకుండా పుస్తక పఠనానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డినేటర్ డా. కె. సత్యనారాయణ, ప్రజాపాలన కోఆర్డినేటర్ ఎస్. కమలాకర్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# వర్ధన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్సవాలు ఘనంగా ప్రారంభం



**వర్ధన్నపేట/మే 11(జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా వర్ధన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యా వారోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి. పోశయ్య అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలకు మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పరిమిత వసతులతోనే జాతీయ, అంతర్జాతీయ సదస్సులు నిర్వహిస్తున్న కళాశాల సిబ్బంది కృషిని అభినందించారు. కళాశాల సొంత భవన సాధనకు, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా వర్షాకాలంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న బురద సమస్యను పరిష్కరించేందుకు కళాశాల ప్రాంగణంలో కంకర చిప్స్ వేయిస్తానని ప్రకటించారు. రాబోయే విద్యా సంవత్సరంలో అడ్మిషన్ల పెంపునకు ప్రజా ప్రతినిధులంతా కృషి చేస్తామని తెలిపారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పోశయ్య మాట్లాడుతూ దాతల సహకారంతో కళాశాలలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని, నాణ్యమైన విద్యను అందిస్తున్నామని







వివరించారు. వారం రోజుల పాటు జరిగే వివిధ కార్యక్రమాల వివరాలను సమన్వయకర్త డాక్టర్ జి. రజిత వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులు శుభారాణి రాజేందర్, ఎం. దేవేందర్, పాపారావు, వాణి కుమారస్వామి, రైతు వేదిక సభ్యులు రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం అతిథులను కళాశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్. రాజు, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా, డాక్టర్ బి. విష్ణుకుమార్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రజిత వందన సమర్పణ చేశారు.

# మృతుల కుటుంబాలకు మార్నేని రవీందర్ రావు పరామర్శ



**ఐనవోలు/మే 11(జర్నలిస్ట్ వార్త):**
హన్మకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలో సోమవారం మాజీ టిస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు పర్యటించారు. తొలుత నందనం సొసైటీ డైరెక్టర్ పల్లకొండ సమ్మయ్య దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం, అనారోగ్యంతో మృతి చెందిన శాగంటి వెంకటయ్య భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మార్నేని రవీందర్ రావు మాట్లాడుతూ సమ్మయ్య, వెంకటయ్యల మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. సమాజ సేవలో వారు చేసిన కృషిని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచులు, జిల్లా స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని నాయకులు ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

